1

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | డిసెంబర్ 29, 2023 | www.navatelangana.com

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర ద్వారా అవగాహన కల్పిస్తున్న రాబిన్ సింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉత్తరప్రదేశ్ లోని ఇటావాకు చెందిన సామాజిక కార్యకర్త రాబిన్ సింగ్ పిలుపునిచ్చారు. నానాటికీ కలుషితమవుతున్న పర్యావరణం ను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను చాటుతూ, ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాబిన్ సింగ్ దేశ వ్యాప్తంగా సుదీర్ఘ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సైకిల్ యాత్ర ద్వారా రాబిన్ సింగ్ గురువారం కామారెడ్డి మీదుగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. నానాటికి పర్యావరణం కాలుష్య కోరల్లో చిక్కుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటోందని, పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహార పదార్థాలు కలుషితం అవుతున్నాయని, ఈ పరిణామం ప్రాణకోటి మనుగడకే ప్రమాదకరంగా పరిణమించిందని ఆవేదన వెలిబుచ్చారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెండ్

నవతెలంగాణ-కామారెడ్డి

అల్ప్రోజోలం రవాణా కేసులో కామారెడ్డి ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేష్ యాదవ్ ను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరిండెంట్ రవీందర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలతో సంబంధం ఉన్న ఏ వ్యక్తినైనా తమ శాఖ నుండి సస్పెండ్ చేస్తూ, తొలగిస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1307 కేసులు నమోదు చేసి కొంత మందిని జైలుకు పంపించడం జరిగిందన్నారు. జిల్లాలో ఈనెల 27 వరకు ఆల్ప్రోజోమ్, గంజాయి, డ్రై గంజాయి, అక్రమ మద్యం, ఎన్డిపిఎల్, జారు, నల్లబెల్లం, దేశదారు, అక్రమ కల్లు, పట్టిక వీటిని రవాణా చేస్తున్న పలు వాహనాలను వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు నాలుగు మద్యం దుకాణాలపై కేసులు నమోదు చేశామన్నారు. ఎన్ డి పి ఎస్ కేసులో అరెస్ట్ అయిన గొల్ల రమేష్‌ను ఈ నెల 25 న విధుల నుండి తొలగించినట్లు కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. జిల్లాలో మత్తుపదార్థాల వాడకం, వాటి రవాణా చేయడంపై ఉక్కు పాదం మోపుతామన్నారు.

వెల్లువలా దరఖాస్తులు

- గ్యారెంటీ పథకాల కోసం తరలివచ్చిన ప్రజలు
- ఆధార్, జిరాక్స్ సెంటర్‌లకు జనం తాకిడి
- తొలిరోజు నిజామాబాద్ జిల్లాలో 11,848, కామారెడ్డిలో 21,914 దరఖాస్తులు
- కొత్తరేషన్ కార్డుల ఊసేది..?
- అధికారుల కొరతతో అవగాహన అంతంతే..


దరఖాస్తు చేసుకునేందుకు నిజామాబాద్‌లో బారులు తీరిన మహిళలు


కామారెడ్డిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

గ్యారంటీ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణను గురువారం నుంచి అట్టహాసంగా ప్రారంభించింది. ఒక్క దరఖాస్తు ఫారంతోనే నాలుగు గ్యారెంటీ పథకాలకు అప్లయ్ చేసుకునే విధంగా ఫారాన్ని రూపొందించింది. ఐదువందల ఇండ్లకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేసి ప్రత్యేధికారులను నియమించింది. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తు స్వీకరించగా.. మున్సిపల్ కేంద్రాల్లో డివిజన్, వార్డుల వారీగా ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. అయితే సిబ్బంది కొరత, ఫారం నింపడంలో అవగాహన లేక పలువురు ఇబ్బందులు పడ్డారు. మార్పులు, చేర్పుల కోసం ఆధార్ సెంటర్‌లకు ప్రజలు పోటెత్తుతున్నారు. దరఖాస్తుల కోసం జిరాక్స్ సెంటర్‌లు కిటకిటలాడాయి.

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 54 గ్రామపంచాయతీలలో నిర్వహించిన కార్యక్రమంలో 17,001 దరఖాస్తులు, 80 మున్సిపల్ వార్డులలో 4918 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా 21,914 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రజాపాలన గ్రామసభలు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 112 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 146 సెంటర్‌లలో నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఇరు జిల్లాల్లో కలెక్టర్‌లు, ఎమ్మెల్యేలు పర్యవేక్షించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సిబ్బంది కొరత..

దరఖాస్తుల స్వీకరణ సందర్భంగా పలు సెంటర్‌లలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దరఖాస్తు నింపడంపై అవగాహన లేక అపసోపాలు పడ్డారు. దరఖాస్తులు నింపేందుకు ఆశాలు, అంగన్‌వాడీలు సహాయంగా ఉంటారని అధికారులు పేర్కొన్నా.. అధికారుల స్థానంలో వారే ఉండి దరఖాస్తులు స్వీకరించారు. దీంతో దరఖాస్తు నింపేందుకు అవగాహన లేక పలువురు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కొత్త రేషన్ దరఖాస్తు ఊసేది..?

గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయకపోగా ఐదు సంవత్సరాలు దాటిన పిల్లలను సైతం రేషన్ కార్డులో జత చేయకపోవడంతో చాలామంది తమ పిల్లల పేర్లను రేషన్ కార్డులో ఎక్కించుకోవాలని ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న దరఖాస్తు ఫారంలో మహాలక్ష్మి రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయుత పథకంలో కొరకు మాత్రమే ఇందులో దరఖాస్తు చేసుకోవలసి ఉండగా తమ పిల్లల పేర్లను రేషన్ కార్డులో ఎలా జత చేసుకోవాలో తెలియక పలువురు తికమక పడ్డారు. పలువురు అధికారులకు సైతం తెలియకపోవడం గమనార్హం. రేషన్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక ఫారం లేకపోవడంతో.. ఉన్న ఫారంలోనే రేషన్ కార్డు దగ్గర కొత్తది ఇవ్వాలని రాసి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం.

మహాలక్ష్మి పథకానికి అర్హులు ఎవరు ?

మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రతినెల మహిళకు 2500 ఆర్థిక సాయం అని పథకంలో జత చేశారు. ఆ 2500 రూపాయలను ఎవరికి, ఎలాంటి వారికి ఇస్తారు, అనే వివరణ ఇవ్వలేదు. బ్యాంక్ ఖాతా నెంబర్ సైతం తీసుకోకపోవడంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇప్పటికే మహిళల్లో వితంతు పింఛన్, జీవన భృతి, వృద్ధాప్య, వికలాంగ తదితర పింఛలను పొందుతూ ఉన్న వారు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారా?

తెలంగాణ ఉద్యమంలో పెద్దఎత్తున పలువురు పాల్గొన్నారు. అయితే అందరిపై కాకుండా కొందరిపైనే కేసులు నమోదు అయ్యాయి. ఉద్యమం సమయంలో ఉదయం వేళ అరెస్ట్ చేసి రాత్రికి విడుదల చేసిన ఘటనలు కోకొల్లల. అయితే వారిపై ఎఫ్ఐఆర్ బుక్ కాలేదు. ఉద్యమ కారులకు 120 గజాలతో ఇల్లు కట్టిస్తామని ఎన్నికల్లో హామీలో భాగంగా దరఖాస్తులో వివరాలు ఇవ్వాలని ఆప్షన్ పెట్టారు. ఉద్యమంలో పాల్గొంటే సంబంధిత ఎఫ్ఐఆర్ నెంబరు, సంవత్సరం, జైలుకు వెళ్తే వాటి వివరాలు అని ఇచ్చారు. ఇది కేవలం జైలుకు వెళ్లిన వారికి వర్తిస్తుందా అందులో పాల్గొన్న వారికి సైతం వర్తిస్తుందా అని దరఖాస్తుదారులు అయోమయంలో ఉన్నారు.

రేషన్‌కార్డుకు తెల్లకాగింలో దరఖాస్తు

మోపాల్ : గ్యారెంటీల అమలుకు దరఖాస్తు స్వీకరిస్తున్నా.. ముఖ్యమైన రేషన్ కార్డుకు సంబంధించిన అంశం అందులో లేకపోవడం గమనార్హం. దీంతో పలుచోట్ల తెల్లకాగితంలో రేషన్ కార్డుకు దరఖాస్తులు స్వీకరించడం గమనార్హం. తెల్లకాగితంలో రాసి ఇస్తే చెల్లుబాటు అవుతుందా అని ప్రజలు బాహటంగానే ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి దరఖాస్తులు గతంలో చాలా చేశామని, కానీ తమకు రేషన్ కార్డు అందలేదని, ఈసారైనా అందేనా అని పెదవివిరుస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లింగం నాయక్, ఎలక్ట్రికల్ ఏఈ బాబా శ్రీనివాస్, ఏ ఈ ఓ చక్రపాణి, ఏపీఎం మోహన్, పంచాయతీ కార్యదర్శి ధీరజ్, సర్పంచ్ లతా భూషణ్, మాజీ సొసైటీ చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూర్య రెడ్డి, సాయి కుమార్, విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు

రేషన్‌కార్డు లేకుంటే పథకాలు వస్తాయా?

సిరికొండ : దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు జత చేయాలని అధికారులు చెబుతున్నారని, రేషన్‌కార్డు లేని వారికి పథకాలు అమలు అవుతాయా అని ప్రజలు సందేహం వ్యక్తం చేశారు. ఈ విషయమై పలువురు అధికారులను ప్రశ్నించారు. అయితే రేషన్ కార్డు లేకపోయినా పథకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, వాళ్లనూ స్కీంల కోసం పరిగణనలోకి తీసుకుంటామని ఎంపీడీవో లక్ష్మికాంత్ తెలిపారు. అలాగే రేషన్‌కార్డు కోసం కూడా అప్లికేషన్లు ఇవ్వవచ్చని తెలిపారు. త్వరలో కార్డులు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.


బస్సును రోడ్డుపక్కకు తిప్పడంతో తప్పిన పెను ప్రమాదం..

పొగమంచు.. తృటిలో తప్పిన పెనుప్రమాదం

- లారీ ఢీకొనబోతుండగా.. చాకచక్యంగా వ్యవహరించి ప్రమాదం బారి నుంచి తప్పించిన ఆర్టీసీ బస్ డ్రైవర్
- ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు

నవతెలంగాణ-కామారెడ్డి

పొగమంచుతో రోడ్డు మీద ముందు వెళ్లే వాహనాలు కనపడని పరిస్థితి నెలకొంది. అయితే కామారెడ్డి జిల్లాలో పొగమంచు కారణంగా ప్రమాదం చోటుచేసుకునే వేళ.. ఆర్టీసీ బస్ డ్రైవర్ చాకచాక్యంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి నుండి గురువారం ఉదయం ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు కరీంనగర్‌కు వెళ్తుంది. ఆ సమయంలో పొగమంచు విపరీతంగా ఉండగా.. ఉగ్రవాయి సమీపంలో ఎదురుగా లారీ ఢీకొనబోతుండగా.. ఆర్టీసీ డ్రైవర్ యాదగిరి చాకచక్యంతో వ్యహరించి బస్సును పక్కకు తిప్పడంతో పెనుప్రమాదం తప్పినట్టయింది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సు ఉగ్రవాయి సమీపంలోకి రాగానే ఎదురుగా అతివేగంతో వస్తున్న లారీ బస్సును ఢీకొట్టబోయింది. ఉదయం పొగ మంచు ఉండడంతో కనిపించి కనిపించకుండా ఉన్న దానిని గమనించిన బస్సు డ్రైవర్ యాదగిరి చాకచక్యంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాకుండా కాపాడినట్టయింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ అధికారులు, పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీఇంచారు. ఆర్టీసీ డ్రైవర్ యాదగిరి చాకచక్యతను ఆర్టీసీ డిఎం, డిఐ, సిఐ అభినందించారు.

సరిపడా అందుబాటులో దరఖాస్తు ఫారాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా పాలన సభలలో ఆరు గ్యారంటీల అమలుకు సంబంధించి ప్రజల నుండి నిర్ణీత నమూనా దరఖాస్తు ఫారాలను స్వీకరిస్తున్నట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం తెలిపారు. దరఖాస్తు ఫారాల కొరత ఎంతమాత్రం లేదని తెలిపారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 2,75,183 నివాస గృహాలు ఉండగా, అంతే సంఖ్యలో దరఖాస్తు ఫారాలు ఆయా జీ.పీలకు పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 146 వార్డులకు గాను 1,30,866 దరఖాస్తులు పంపిణీ చేశామన్నారు. గ్రామ పంచాయతీలు, వార్డులను కలుపుకుని మొత్తం 406049 దరఖాస్తులు కేటాయించి, గ్రామాలలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా, మున్సిపల్ పట్టణాలలో ఆర్.పీలు, ఇతర సిబ్బంది ద్వారా ప్రజలకు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. వీటితో పాటు అదనంగా మరో 93,000 దరఖాస్తు ఫారాలు సైతం అందుబాటులో ఉంచడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తు ఫారాలకు ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు.

యువకుడి ఇంటి ఎదుట యువతి బైటాయింపు

- ప్రేమించి పెండ్లి చేసుకుంటానని మొఖం చాటేశాడని వాపోయిన యువతి


యువకుడి ఇంటి ఎదుట బైటాయించిన యువతి, కుటుంబీకులు

నవతెలంగాణ-కామారెడ్డి

నాలుగేండ్లు ప్రేమించి పెండ్లి చేసుకుంటానని మోసం చేశాడని వాపోతూ యువతి.. యువకుడి ఇంటి ఎదుట కుటుంబీకులతో కలిసి బైటాయించింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీబీపేట మండల కేంద్రనికి చెందిన ఎంబరి ప్రశాంత్, అదే గ్రామానికి చెందిన నీల రాజేశ్వరి నాలుగేండ్లుగా ప్రేమించుకున్నారు. అయితే ప్రశాంత్‌కు మరో అమ్మాయితో వారి కుటుంబ సభ్యులు వివాహం చేయనున్నారని తెలిసి సదరు బాధితురాలు రాజేశ్వరి ప్రియుడి ఇంటికి వెళ్లి తమ ప్రేమ గురించి కుటుంబీకులకు వెల్లడించినా వారు పట్టించుకోలేదు. దీంతో బీబీపేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు అత్యాచారం కింద కేసు నమోదు చేసి ప్రశాంతును జైలుకు పంపించారు. రెండు నెలలు జైలు శిక్ష అనుభవించి 10 రోజుల క్రితం బెయిల్ పై ఇంటికి చేరుకున్నాడు. సదరు బాధితురాలు రాజేశ్వరి ప్రశాంత్ వద్దకు వెళ్లి తనను పెళ్లి చేసుకోవాలని అడగగా కేసు పెట్టావు నేను జైలుకు వెళ్లాను శిక్ష అనుభవించి వచ్చాను, కోర్టులో ఇంకా కేసు నడుస్తుంది, ఈ పరిస్థితుల్లో నేను పెళ్లి చేసుకోలేనని చెప్పడంతో ప్రియురాలు కుటుంబ సభ్యులతో కలసివచ్చి తాళం వేసి ఉన్న ప్రియుడి ఇంటి ముందు బైఠాయించి ఆందోళనకు దిగింది. తనను ప్రేమించి శారీరకంగా వాడుకొని మోసం చేసిన ప్రశాంత్ తనను పెళ్లి చేసుకోవాలని, సచ్చినా బతికినా అతనితోనే నని తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి జరిగేది లేదని రాజేశ్వరి ప్రశాంత్ ఇంటి ముందు భీష్మించుకుని కూర్చుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని సముదాయించడంతో ఆందోళన విరమించారు.

ఎన్నికల ఖర్చు వివరాలు సమర్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2023 నవంబర్ 30న జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలల్లో నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఆయా శాసన సభ నియోజకవర్గాల నుండి పోటీ చేసిన అభ్యర్థులు ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చుల రికన్సీలేషన్ నేడు నిర్వహించనున్నామని ఎన్నికల అధికారి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పోటీ చేసిన అభ్యర్థులందరు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్లో)లో వారి ఎన్నికల ఖర్చుల వివరాలని సమర్పించి జమ, ఖర్చులలో వ్యత్యాసాలను సరి చేసుకోవలని సూచించారు.

‘ప్రజా పాలన’కు శ్రీకారం

- పల్లెలు, వార్డులలో పకడ్బందీగా ప్రజాపాలన సభలు
- ఆరు గ్యారంటీల అమలుకై దరఖాస్తుల స్వీకరణ
- నిర్వహణ తీరును పర్యవేక్షించిన కలెక్టర్, నోడల్ అధికారులు
- అర్హులందరికీ లబ్ది చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి


దరఖాస్తు పూరించడంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్, నోడల్ అధికారి

నవతెలంగాణ-మోపాల్/ఎడపల్లి/నిజామాబాద్‌రూరల్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని నిజామాబాద్ జిల్లాలో గురువారం అట్టహాసపు ఏర్పాట్ల నడుమ ప్రారంభించారు. నేటి నుండి జనవరి 06 వరకు (8 పని దినాలలో) కొనసాగనున్న ఈ కార్యక్రమం కోసం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా షెడ్యూల్ ను ఖరారు చేశారు. ఇందులో భాగంగా మొదటి రోజైన గురువారం 112 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల పరిధిలోని 146 మున్సిపల్ వార్డులలో ప్రజా పాలన సభలు కొనసాగాయి. రద్దీ, తోపులాటలు ఆస్కారం లేకుండా మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా కౌంటర్లను ఏర్పాటు చేసి ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుండి అధికార బృందాలు దరఖాస్తులు స్వీకరిం చాయి. దరఖాస్తుల వివరాలను కంప్యూటరీకరణ చేసేందు కు వీలుగా టీమ్ లీడర్లు వాటిని భద్రపర్చారు. ఉదయం 8.00 గంటలకే ప్రజాపాలన సభలతో పల్లెలు, వార్డులలో సందడి మొదల య్యింది.

జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని మాధవనగర్, మోపాల్ మండలం తాడెం గ్రామాలలో నిర్వహించిన ప్రజాపాలన సభలను క్షేత్ర స్థాయిలో సందర్శించి నిర్వహణ తీరుతె న్నులను పరిశీలిం చారు. దరఖాస్తుల స్వీకరణ, రసీదులు అందజేత, రిజిస్టర్ల నిర్వహణ, వివరాల నమోదు, ప్రజలకు అందుబాటులో ఉంచిన తాగు నీరు, షామియానాలు వంటి వసతులను పరిశీలించి అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏ చిన్న ఇబ్బందులకు తావు లేకుండా పకడ్బందీగా సభలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కాగా, ఉమ్మడి జిల్లా నోడల్ ఆఫీసర్ గా నియమితులైన ఐ.ఎ.ఎస్ అధికారిణి హరిత ఇందల్వాయి మండలం రంజిత్ నాయక్ తండా, డిచ్పల్లి మండలం వెస్లీనగర్ తండా, మాధవనగర్ తదితర ప్రాంతాల్లో ప్రజాపాలన కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, నగర పాలక కమిషనర్ మకరంద్ సైతం విస్తృతంగా పర్యటిస్తూ ప్రజాపాలన సభలకు తోడ్పాటును అందించారు. ఆరు గ్యారంటీలలో భాగంగా మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి ప్రజలు పెద్ద సంఖ్యలో దరఖాస్తులను అందించారు.

బాపునగర్ నుండి ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిన బోధన్ ఎమ్మెల్యే

బోధన్ నియోజకవర్గం ఎడపల్లి మండలంలోని బాపునగర్ గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి, వారికి రశీదులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ది చేకూర్చడమే ప్రజా పాలన ధ్యేయమని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. జనవరి 06 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని, అర్హులైన వారందరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు మేలు చేకూర్చాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రతిపక్షాలు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు చేయాలని హితవు పలికారు. అనంతరం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బోధన్ పట్టణంలోని ఆయా వార్డులతో పాటు చిన్నమావందిలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట బోధన్ ఆర్డీఓ రాజాగౌడ్, బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఎంపీడీఓ గోపాలకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఖనాపూర్ లో ప్రజా పాలనను ప్రారంభించిన రూరల్ ఎమ్మెల్యే

కాగా, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని ఖనాపూర్‌లో ప్రజాపాలన గ్రామ సభను రూరల్ ఎమ్మెల్యే పి.భూపతి రెడ్డి ప్రారంభించారు. అర్హులైన ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా నిర్ణీత కాలవ్యవధిలో అందరికీ ఆయా పథకాల ద్వారా లబ్ది చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, కార్పొరేటర్ కోర్వ లలితా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. సభలలో తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు తమ ఆటపాటలతో ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు.



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి.. ఎడపల్లి మండలంలో దరఖాస్తు ఫారాలు అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

చనిపోయిన వ్యక్తి ఖాతాలో నుంచి డబ్బులు డ్రా

- బకాయిలు లేవంటూ ఎన్‌వోసీ ఇచ్చి.. మళ్లీ పంట రుణం కింద డబ్బుల జమ
- ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ఎదుట రైతులు ధర్నా.. మేనేజర్ సిబ్బంది నిలదీత

వివరాలు మెయిన్‌లో..


బ్యాంక్ మేనేజర్‌ను నిలదీస్తున్న రైతులు

నవతెలంగాణ-లింగంపేట్

ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తి బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బులు డ్రా చేయడంతో పలువురు రైతులు బ్యాంకును ముట్టడించి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఎదుట రైతులు గురువారం బైటాయించారు.

నేటి ప్రజా పాలన సభలు జరిగే గ్రామాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నేడు (శుక్రవారం) 101 గ్రామాలలో సభలను నిర్వహించి ఆరు గ్యారంటీలపై ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించనున్నట్టు డీపీవో జయసుధ తెలిపారు. ఆర్మూర్ పరిధిలోని గుత్ప, గుత్పతండా, చేపూర్, ఫతేపూర్, పిప్రి, సురభిర్యాల్, దత్తాపూర్, డొంకేశ్వర్, బొంకన్పల్లి, కిందితండా, మాక్లూర్, ముల్లంగి(బి), ఆంధ్ర నగర్, కౌల్పూర్, నందిపేట, వెల్మల్ లో ప్రజాపాలన సభలు జరుగుతాయని తెలిపారు. బాల్కొండలోని బుస్సాపూర్, నాగాపూర్, దేవక్కపేట, కొత్తతండా, రహత్నగర్, తాళ్ళపల్లితండా, బషీరాబాద్, నాగపూర్, నరసాపూర్, కొనస ముందర్, దూదిగాం, మెండోరా, పోచంపాడ్, దొన్కల్, శెట్పల్లి, సుంకెట్, తిమ్మాపూర్, ముప్కాల్, రెంజల్, వేంపల్లి, పచ్చలనడికుడ, వేల్పూర్, దోంచంద, గుమ్మిరియల్, తడపాకల్, తొర్తి లలో ప్రజాపాలన సభలు జరుగుతాయన్నారు. బాన్సువాడ సెగ్మెంట్లోని నిజామాబాద్ జిల్లా పరిధిలో గల చందూర్, ఏక్లాస్పూర్, ఎత్తోండ, కోటగిరి, లింగాపూర్, గోవూరు, కొల్లూరు, కోడిచెర్ల, రుద్రూర్, మల్లారం, రాజ్ పేట్, శంకోరా, తగిలేపల్లి గ్రామాలలో సభలు జరుగుతాయన్నారు. బోధన్ పరిధిలోని లాంగ్దపూర్, మినార్పల్లి, నాగంపల్లి, పెగడాపల్లి, అబ్బాపూర్(ఎం), అభంగపట్నం, కమలాపూర్, కోస్లీ, భాగేపల్లి, కూనేపల్లి, నీలా, రెంజల్, హున్సా, సాలంపాడ్ క్యాంప్, మంగళ్ పాడ్, ఎంఎస్సి.ఫామ్, నెహ్రూనగర్, వడ్డేపల్లి గ్రామాలలో చేపట్టనున్నట్టు తెలిపారు. నిజామాబాద్ రూరల్ పరిధిలోని బిల్యా తండా, చల్లగరిగే, ధనంబండ తండా, మద్దులతండా, మారియా తండా, వాడి, ఆరెపల్లి, ధర్మార్(బి), నడిపల్లి, నడిపల్లి తండా, గంగారాం తండా, లోలం, మల్లాపూర్, తీర్మాన్ పల్లి, అర్గుల్, జక్రాన్పల్లి, లక్ష్మాపూర్, నారాయణపేట, భైరాపూర్, చిన్నాపూర్, కాల్పోల్, కులాస్పూర్, ధర్మారం(ఎం), ధర్మారం తండా, కేశాపూర్, కొండూరు, గోప్యతాండా, గోప్యనాయక్ తండా, పాకాల, వార్జున్ తండాలలో కొనసాగనున్నాయి.

నేడు నూతన పాలకవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నూతన పాలక వర్గాన్ని శుక్రవారం ఎన్నుకోనున్నట్టు జిల్లా మత్స్య శాఖ జిల్లా అధికారి జి.రాజనర్సయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్ నిజామాబాద్‌కు కొత్తగా 11 మంది సభ్యులతో కూడిన నూతన పాలక వర్గం ఎన్నుకునేందుకు నగరంలోని కే.సి.ఆర్.కాలనీ, యస్‌యస్ కన్వెన్షన్ హాలులో ఎన్నిక కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాథమిక మత్స్య, మహిళ, మార్కెటింగ్ సంఘాల అధ్యక్షులతో సర్వసభ్య సమావేశంను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశానికి అధ్యక్షులకు మాత్రమే అర్హత కలదని, మత్స్యశాఖ వారు జారీచేసిన గుర్తింపు కార్డులు చూపించి సమావేశానికి హాజరు కావాలని కోరారు.

గ్యాస్ కేవైసీపై ఆందోళన చెందవద్దు

నవతెలంగాణ-సిరికొండ

సిరికొండ మండలంలో కేవైసీ కోసం ఎల్‌పీజీ ఏజెన్సీల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ రామిరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకం సిలిండర్ రూ.500లకు పొందేందుకు కేవైసీ డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని పుకారు రావడంతో ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల వద్ద భారీ సంఖ్యలో వినియోగదారులు వస్తున్నారని తెలిపారు. కేవైసీ కోసం గంటల తరబడి వేచి ఉంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ రూ.500 సిలిండర్ విధి విధానాలు ఇంకా అందలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చమురు మార్కెటింగ్ కంపెనీల ద్వారా వినియోగదారుల ఇంటి వద్దకేవెళ్లి కేవైసీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అందువల్ల వినియోగదారులు భయాందోళన చెందవద్దని తెలిపారు. డెలివరీ బాయ్ సిలిండర్‌ను ఇంటికి తీసుకొచ్చినప్పుడు కేవైసీని పూర్తి చేయాలని కోరారు. ఏదైనా ఇబ్బంది లేదా సాంకేతిక సమస్య ఉంటే అప్పుడు సంబంధిత పంపిణీదారులను సందర్శించాలని తెలిపారు.

సింగరేణి కార్మికులకు జేజేలు



విజయోత్సవాలు జరుపుకుంటున్న ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సింగరేణి రాష్ట్ర గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ గెలుపు సందర్భంగా నిజామాబాద్ ఏఐటీయూసీ కార్యాలయం ముందు నాయకులు గురువారం బాణాసంచా కాల్చి విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పి. నర్సింగరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణి బొగ్గుగనుల్లో పనిచేస్తున్న కార్మిక వర్గం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసికి మొత్తం 11 స్థానాలకు గాను ఐదు స్థానాలతోపాటు భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. రాష్ట్ర గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ అనుబంధ సంఘానికి ఓట్లు వేసి అవకాశం ఇచ్చిన సింగరేణి కార్మిక వర్గానికి సిపిఐ, ఏఐటీయూసీగా జేజేలు తెలిపారు. పది సంవత్సరాలుగా కార్మిక సమస్యలు పరిష్కరించకుండా గుర్తింపు ఎన్నికలు నిర్వహించకుండా బీఆర్ఎస్ కాలయాపన చేసిందన్నారు. భవిష్యత్ కాలంలో సింగరేణి రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపైన యాజమాన్యంతో చర్చించి సమస్యలు పరిష్కారం చేయడంలో ఏఐటియూసి ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు పి.హనుమాన్లు, అనిల్, సాయన్న, ప్రసాద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి నరసింహారెడ్డి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి నరసింహారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోగల మామిడిపల్లిలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జివి నరసింహారెడ్డి అన్నారు. గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్మూర్లో చేపడుతున్న అక్రమ కట్టడాల గురించి మున్సిపల్ కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదు చేసిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. మామిడిపల్లిలో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయం రియల్ ఎస్టేట్ అడ్డాగా మారిందని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ద్యాగ ఉదయ్, పులి యుగంధర్, విజయానంద్, పీర్ సింగ్ ,ఖందేశ్ ప్రశాంత్, చిన్నారెడ్డి, నగేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 139వ ఆవిర్భావ దినోత్సవం

- జెండా ఆవిష్కరణ


కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీ 139వ అవిర్భవ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన పార్టీ జెండా ఆవిష్కరణ గురువారం చేశారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు తాహేర్ బిన్ హందన్, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, రత్నాకర్, వేణురాజ్, యాదగిరి, రాజ నరేందర్‌గౌడ్, విపుల్ గౌడ్, చంద్రకల, ఉష, రేవతి, ఈసా, కేశ మహేష్, ప్రీథం, పంచరెడ్డి చరణ్, సుమన్, మలైకా బేగం తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం మండల అధ్యక్షులు రవిప్రకాష్ అధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేందర్, మైనార్టీ మండల అధ్యక్షులు అలీం, నాయకులు పాషా, శ్రీనివాస్, రాజు, స్వామి, జైల్ సింగ్, శర్మన్, తదితరులు పాల్గొన్నారు.


మాక్లూర్‌లో...

ప్రజల వద్దకే పాలన

- అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- అర్హులు సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


నిజామాబాద్ సిటీ: దరఖాస్తు ఫారంను అందజేస్తున్న ఎమ్మెల్యే


మోపాల్: అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్


కమ్మర్‌పల్లి: మాట్లాడుతున్న యోహాన్


బాల్కొండలో...

నవతెలంగాణ- విలేకరుల బృందం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరంలో 26వ డివిజన్‌లో శివాజీనగర్ గౌడ సంఘంలో ప్రజా పాలనా కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మున్సిపల్ కమిషనర్ మందమకరంద్ పాల్గొని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా పాలన ఉదేశమే ప్రజల వద్దకు ప్రభుత్వం అన్నారు. నగరంలో ప్రజా పాలనను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారెంటీ పథకాలు కింది స్థాయి వరకు చేరేదాకా ఉండాలని అన్నారు. ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. 6 గ్యారెంటీ పథకాలే కాకుండా ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే జనరల్ కౌంటర్ ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. ప్రజా పాలనా కార్యక్రమాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతిస్తుందన్నారు. దరఖాస్తు ఫారంలో తప్పులు లేకుండా చూసి నింపాలన్నారు. అధికారులు ప్రజలకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు. ప్రతీ డివిజన్‌లో రెండు కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా 6వ తేదీ వరకు ఈకార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ శ్యామ్, స్థానిక కార్పొరేటర్ బంటు వైష్ణవి రాము, అధికారులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి యోహాన్ అన్నారు. గురువారం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువు తండా, దొమ్మరి చౌడు తండా, ఇనాయత్ నగర్, రాజరాజేశ్వరి నగర్ గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు. దొమ్మరి చౌడు తండా గ్రామ పంచాయతీలో మండల ప్రత్యేకాధికారి యోహాన్, మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త చెరువు తండా పంచాయతీలో ఎంపీడీవో సంతోష్ రెడ్డి మాట్లాడుతూ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల జనవరి 6వ తేదీ వరకు అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు లకావత చిన్ని, గుగులోతు భాస్కర్, సునావత్ లస్కర్, అమరగోని రోజా సదాశివ గౌడ్, ఎంపీటీసీ సభ్యులు లకావత్ గంగాధర్, పిప్పెర అనిల్, తహసిల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ భాస్కర్, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య, ఏపిఎం కుంట గంగారెడ్డి, మండల పర్యవేక్షకులు మైలారం గంగాధర్, ఈజీఎస్ ఏపీవో విద్యానంద్, ఐసిడిఎస్ కోన సముందర్ సెక్టార్ పర్యవేక్షకురాలు సవిత, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలోని తానాకుర్ధి, కులాస్పూర్ తాండలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తానకుర్ధి గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ సంజీవ్ కుమార్, ఎంపీడీవో లింగం నాయక్‌తో కలిసి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ సంజీవ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిన సందేశాన్ని మొదటగా అక్కడున్న ప్రజలకు వినిపించారు. అప్లికేషన్ ఫామ్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ పథకాలో ఉన్న ఒక్కొక్క అంశం గురించి ప్రజలకు తెలియజేస్తూ వారికి కావాల్సిన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నిరుపేదలైన ప్రజలందరూ ఈ సదుపాయాన్ని వినియోగించు కోవడంవల్ల ప్రభుత్వం నుంచి అందాల్సిన గ్యారెంటీ పథకాలన్నీ అందుతాయని ముఖ్యంగా 500 రూపాయలు సిలిండర్, మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహలక్ష్మి, తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు.

బాల్కొండ: ఆరుగ్యారంటీల అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం బాల్కొండ మండల పరిధిలోని గ్రామాల్లో అధికారులు ప్రారంభించారు. మండల ప్రత్యేక అధికారి రఘురాజ్, ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ అద్ప శ్రీధర్ ఆధ్వర్యంలో జలాల్‌పూర్, ఇత్వార్‌పేట్ గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి అభయ హస్తం దరఖాస్తులు, పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామపంచాయతీల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా గ్రామ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి రఘురాజ్ మాట్లాడుతూ దరఖాస్తుల స్వీకరణ జనవరి 6 వరకు కొనసాగుతుందని అనంతరం తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభయ హస్తంపై గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నామని తెలిపారు. మండలంలోని బస్సాపూర్, నాగపూర్ గ్రామాల్లో ఈనెల 29న, బోదేపల్లి, వన్నెల్ (బి)లో 30న, శ్రీరాంపూర్, బాల్కొండలో జనవరి 2న, చిట్టాపూర్, కిసాన్ నగర్‌లో జనవరి 3న గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ప్రత్యేక అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా అందరి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాల్కొండ ఎస్సై కే గోపి, ఎంఈఓ బట్టు రాజేశ్వర్, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి మహేందర్‌రెడ్డి, వైద్యశాఖ అధికారిని స్రవంతి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని సర్వల్లి తాండ, పోత్నూర్ కుర్దుల్ పేట్ గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరుగ్యారంటీల కోసం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాకారం రవి మాట్లాడుతూ అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జనవరి 6 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామసభలు ఏర్పాటు చేసి మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత, రైతు భరోసా తదితర పథకాలు (ఆరు గ్యారెంటీలు) కోసం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం రెండు గంటల నుండి 6 గంటల వరకు రెండు దఫాలుగా దరఖాస్తులు స్వీకరిస్తామని ఈ ఆరు గ్యారెంటీల పథకాల కోసం గ్రామస్తులు పెద్దఎత్తున దరఖాస్తు చేసుకుంటున్నారు.

మాక్లూర్: ప్రతి ఒక్కరూ తమ వివరాలను పొందుపరిచి సంబంధిత అధికారులకు అందించాలని జెడ్పీ చైర్మన్ డీ. విఠల్ రావు తెలిపారు. మండలంలోని అమ్రాద్ గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అరు గ్యారంటీలను ప్రతి ఒక్కరూ పొందాలని, దానికి సంబంధించి వివరాలను దరఖాస్తు ఫారంలో నింపి అధికారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఆర్డీవో వినోద్ కుమార్, ప్రత్యేక అధికారి ముత్తన్న, ఎంపీడీవో క్రాంతి, స్థానిక సర్పంచ్ లింగం,గ్రామస్తులు పాల్గొన్నారు.

భీంగల్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28 నుండి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజా పాలనలో భాగంగా తొలి రోజు ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల అధికారులు తెలిపారు. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ కన్నె ప్రేమలత ప్రత్యేక అధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా పాలన గురించి అవగాహన కల్పించి దరఖాస్తు పత్రాలను అందజేశారు అలాగే బాబా నగర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పి సీఈవో గోవింద్ హాజరై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటరమణ ,ఎంపీడీవో రాజేశ్వర్ ,బాబా నగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్, భీంగల్ మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు

ముప్కాల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ఆరు గ్యారెంటీల 'అభయ హస్తం' దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మండల ప్రత్యేకాధికారి ఏడీ శ్రీనివాస్ కొత్తపల్లి గ్రామంలో తోటి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.. మండలంలోని కొత్తపల్లి, నల్లూర్, వెంచిర్యాల, నాగంపేట్ గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగింది. శుక్రవారం రెంజర్ల, వేంపల్లి, 30న ముప్కాల్‌లో కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీడీవో దామోదర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వనజ రాణీ, ఎంపీడీవో దామోదర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ గంగారాం, ఎంపీవో భారత్ చంద్ర, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రెవిన్యూ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, అంగన్ వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ప్రతి కుటుంబం నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఇంచార్జి ఎంపీడీవో బ్రహ్మానందం అన్నారు. మండలంలోని గనియా తండా, బాలనగర్ గ్రామపంచాయతీలో గ్రామసభలో ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులను గ్రామస్థాయి అధికారులు మండల స్థాయి అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బ్రహ్మానందం మాట్లాడుతూ దరఖాస్తులను స్థానిక పంచాయతీ సెక్రెటరీ స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమాల రాజు, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాదరావు, తహసీల్దార్ కలీం, బాలనగర్ సర్పంచ్ నిహారిక, గన్యా తాండ సర్పంచ్ నర్సింగ్, పంచాయతీ కార్యదర్శులు కార్తీక్, నర్సారెడ్డి, గన్యా తండా కారోబార్ పాల్గొన్నారు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాల పరిధిలో మొదటి రోజు ప్రజా పాలన గ్రామసభలను ఆకస్మికంగా సందర్శించి ఏర్పాట్లను, ప్రజల నుండి వస్తున్న దరఖాస్తులను ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నోడల్ అధికారిని ఎం.హరిత పరిశీలించి పలు సూచనలు సలహాలు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధికారి వెంట జాయింట్ కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్డీవో రాజేంద్ర కుమార్, తహసిల్దార్లు రాజేందర్ , వెంకట్రావు, ఎంపిడిఓ టీవీఎస్ గోపి బాబు, రాములు నాయక్, నోడల్ అధికారులు తదితరులు ఉన్నారు.


జక్రాన్‌పల్లిలో...


డిచ్‌పల్లి: దరఖాస్తులను పరిశీలిస్తున్న హరిత


మాక్లూర్: మాట్లాడుతున్న జడ్పీ చైర్మెన్ విఠల్ రావు


సిరికొండలో...



భీంగల్‌లో...


ముప్కాల్‌లో...

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్ చేశారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఖిల్లా చౌరస్తా వద్ద పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేఆయలని, ప్రభుత్వ హాస్టల్లో మెస్, కాస్మొటిక్ చార్జీలను విడుదల చేయాలని ప్లకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం సమస్యలతో సతమతమవు తుందన్నారు. ప్రధానంగా సంక్షేమ వసతిగృహాలు, గురుకుల, కెజిబివి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం మెస్ ఛార్జీలు పెంచామని ప్రకటించిన అవి అమలు కావడం లేదని తెలిపారు. సంవత్సర కాలం నుంచి హాస్టల్స్ మెస్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. హాస్టల్స్ విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీల ఊసేలేదని, అందుకే విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 7,792 కోట్ల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు విశాల్, నాయకులు కైఫ్, రషీద్, వీర్, పవన్ జూనియర్ కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కంఠేశ్వర్

చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కార్యాలయంలో వడ్డెర వృత్తిదారుల సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇడగొట్టి సాయిలు మాట్లాడుతూ... కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. ఒడ్డెరుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు అవుతున్నా ఒడ్డెర వృత్తిదారుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయన్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అయిన వడ్డెర వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వడ్డెర వృత్తిదారులు పని చేస్తున్న సందర్భంలో కాళ్లు, చేతులు విరిగి వికలాంగులుగా మారుతున్నారన్నారు. తమ ప్రాణాలను సైతం పోగోట్టుకున్నారని అన్నారు. కావున వడ్డెర వృత్తిదారులకు రూ.5లక్షల భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అంతేకాకుండా 50 సంవత్సరాలు దాటిన వడ్డెర వృత్తిదారులకు కల్లుగీత, చేనేత కార్మికులకు ఇచ్చేవిధంగా పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెర వృత్తిదారులకు క్వారీలు, గుట్టలపై పూర్తి హక్కులు కల్పించాలని అయన డిమాండ్ చేశారు. అర్హులైన ఒడ్డెర వృత్తిదారులకు రేషన్ కార్డులు, పింఛన్లు, ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యులు వడ్డెన్న, చందర్, సాయిలు, సాయందర్, పాపన్న, మైపాల్, గంగారాం, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను సయ్యద్ సాజిద్, తండ్రి పేరు సయ్యద్ లాల్, గ్రామం,మం: ముప్కాల్, జిల్లా: నిజామాబాద్. నా సొంత పని నిమిత్తం నేను 12/12/2023 న నల్లూరు గ్రామం నుంచి ముప్కాల్ మీదుగా నా బైక్ పై వెళ్తుండగా మార్గమధ్యలో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం **E0635621** పోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈ సెల్ నెం.98489 33880 కు ఫోన్ చేసి తెలపగలరు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శుక్రవారం | డిసెంబర్ 29, 2023 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తలారి పోచయ్య మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని గురువారం సర్పంచ్ పద్మ నాగరాజు మంగళవారం పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా అంత్యక్రియల ఖర్చు నిమిత్తం పోచయ్య కుటుంబ సభ్యులకు రూ.3వేలు ఆర్థిక సహాయం అందించినట్టు ఆయన అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసానిచ్చారు. సర్పంచ్ ఆర్థిక సాయం అందించడంతో మృతుని కుటుంబ సభ్యులు రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామానుజాచారి, ఎస్ఎంసి చైర్మన్ అగమయ్యా, యాదగిరి, నరేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం చేస్తున్న సర్పంచ్

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డు రామేశ్వర్‌పల్లె, పూలే అంబేద్కర్ కాలనీకి చెందిన బిఎల్‌పి పార్టీ సభ్యులు కామ్రేడ్ ధర్మారెడ్డి పాముకాటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం ఆయన కుటుంబాన్ని బిఎల్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిరిగాద సిద్ధిరాములు పరామర్శించారు. పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం, పార్టీ సభ్యులు అమరుడు దర్మారెడ్డి అంత్యక్రియలను దగ్గరుండి జరిపించారు. ఆయనతోపాటు పార్టీ నాయకులు ఎం.ఆంజనేయులు, వడ్ల సాయికృష్ణ, గంగామణి, స్వప్న, లక్ష్మీ, చిన్న లక్ష్మి, స్వామి, చంద్ర కాంత్‌రెడ్డి, తలారి స్వామి, తదితరులున్నారు.


నివాళి అర్పిస్తున్న సిద్ధిరాములు


బోధన్: దరఖాస్తు ఫారంను అందజేస్తున్న ఎమ్మెల్యే


భిక్కనూర్: దరఖాస్తు ఫారంను స్వీకరిస్తున్న ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంపీవో


నాగిరెడ్డిపేట్: దరఖాస్తు ఫారంను స్వీకరిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి
- ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్: ప్రజా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి దరఖాస్తులు స్వీకరించాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని 26, 5 వార్డులో ఆయన ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలు ప్రజల సమస్యలు పరిష్కారం కాక ఎంతో ఇబ్బందులు పడ్డారని, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. కానీ నేటి ప్రభుత్వంలో ప్రజలకు ఆర్థిక భారం ఇబ్బందులు తగ్గించడానికి ప్రభుత్వమే దరఖాస్తు ఫారాలను ఉచితంగా పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ప్రజలు తమకు కావలసిన దానినే దరఖాస్తు ఫారంలో రాసి ఇవ్వాలని సూచించారు. రేషన్ కార్డులు నిరుపేదల కోసమేనని, అవసరం లేని వారు రేషన్ కార్డులను తిరిగి ఇచ్చివేయాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు 6 గ్యారంటీలను అమలు చేయడానికి 20రోజుల్లోనే ప్రజల ముందుకు వచ్చిందన్నారు. ఇండ్లు, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డుల కోసం నిరుపేదలు ఈ ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో సన్న బియ్యం అందించే దిశగా ప్రభుత్వం పరిశీలిస్తుందని అన్నారు. ప్రజలు అధైర్యపడవద్దని వారికి కావలసిన అన్ని రకాల సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. అనంతరం పలు గ్రామాలలో ప్రజాపాలన గ్రామసభలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మున్సిపల్ చైర్మన్ తూము పద్మావతి, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, దాము, గంగాశంకర్, పాషా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండలంలోని రామారెడ్డి, ఇస్సన్నపల్లి, గొడుగుమర్రి తాండ, అన్నారం గ్రామాల్లో మొదటిరోజు గురువారం ప్రజల పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఆయాగ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. అధికారులు ఇచ్చే దరఖాస్తులో వివరాలను పొందుపరుస్తూ ప్రజలు అధికారులకు దరఖాస్తులను అందజేశారు. దరఖాస్తుల్లో కొత్త రేషన్ కార్డుల, యువ వికాసం వంటి వాటికి అవకాశం ఇవ్వకపోవడంతో, ప్రజలు తెల్లపేపర్‌పై దరఖాస్తులను, ప్రత్యేక కౌంటర్లో అందజేశారు. రామారెడ్డి సెంటర్‌ను మండల స్పెషల్ ఆఫీసర్ వరదారెడ్డి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై సుధాకర్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సబితారెడ్డి, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు క్రాంతికుమార్, అరవింద్‌రెడ్డి, రాజేష్, నరేష్, సాగర్, కానిస్టేబుల్ లక్ష్మీకాంత్, పవన్, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందేవిదంగా చూడాలని జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్ అన్నారు. బీబీపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రజా పాలన కార్యక్రమంపై ఎంపీడీఓ చంద్రోదయ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు అధికారుల ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీ వైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ఆరుగ్యారంటీలలో భాగంగా సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించి నిరుపేద లబ్దిదారులకు అందించాలని కోరారు. ప్రతి గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్ర సేనరెడ్డి, నాయకులు భూమాగౌడ్, సుతారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారంటీల ప్రభుత్వ పథకాల కోసం తహసీల్దార్ సంజయ్‌రావ్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంజయ్‌రావ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల ప్రభుత్వ పథకాల కోసం గ్రామాలలో వచ్చే నెల 6వ తేదీ వరకు మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజలు దరఖాస్తులు అందజేయాలని కోరారు. దోమకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాపాలన ప్రభుత్వ పథకాల కోసం మహిళలు, గ్రామస్తులు బారులు తీరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నరెడ్డి, ఎంపీవో తిరుపతి, డిప్యూటీ తహసీల్దార్ రేఖ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెంజల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజలు దరఖాస్తులను స్వీకరించారు. గురువారం మండలంలోని అంబేద్కర్‌నగర్, మౌలాలి తాండ గ్రామాలలో ఎంపీడీవో శంకర్ ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారెంటీ పథకాల దరఖాస్తులను కుటుంబ యజమానికి ఇచ్చి పథకాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సేకరిస్తూ కౌంటర్లో ఉన్న సిబ్బంది ఆ దరఖాస్తులను పూర్తి చేసి గ్రామ కార్యదర్శికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మధుర బాయ్, జాదవ్ సునీత బాబునాయక్, విద్యుత్తు రాజలింగం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సునీల్ యాదవ్, మౌలాలి తాండ కార్యదర్శి రజిత, సీసీలు కృష్ణ, రాజయ్య వ్యవసాయ విస్తీర్ణ అధికారి అజయ్‌కుమార్, ఉపసర్పంచ్ మూస, అంగన్వాడీ, కార్యకర్తలు ఆశలు పాల్గొన్నారు.

భిక్కనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 6 గ్యారంటీలలో ఐదు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం భిక్కనూర్ పట్టణంతో పాటు పెద్దమల్లారెడ్డిలో ఎమ్మార్వో శివ ప్రసాద్, ఎంపిడిఓ అనంతరావు, ఎంపిఓ ప్రవీణ్ కుమార్ స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు. అంతకుముందు గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో గ్రామసభను నిర్వహించి ప్రజాపాలన గ్యారంటీలకు సంబంధించిన విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో టెంటు, మంచి నీరు, వైద్య సదుపాయాన్ని కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి గాల్‌రెడ్డి, సర్పంచ్‌లు వేణు, లక్ష్మీ రాజలింగం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీంరెడ్డి, సొసైటీ చైర్మన్ బాలగోని రాజగౌడ్, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను ప్రారంభించిన ఎంపీపీ, జెడ్పిటిసి

నాగిరెడ్డిపేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని నాగిరెడ్డిపేట్ మండలంలో ఎంపీపీ రాజుదాస్, జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి ప్రత్యేక అధికారి రఘునాథ్ మూడు గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని ధర్మారెడ్డి, అచ్చాయిపల్లి, బొల్లారం గ్రామాలలో ప్రజాపాలన ప్రారంభమైంది. ఈ సందర్భంగా జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ప్రజాపాలన మండలంలో జనవరి ఆరో తారీకు వరకు కొనసాగుతుందని ఆయా గ్రామాలలో నేటి నుండి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు.

ఆరు గ్యారంటీలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల సర్పంచులు శైలజ, వీణ, ఎంపీడీవో రఘు, ఎంపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ మహేంద్రకుమార్‌తో పాటు ఆయాశాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.


రెంజల్: మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్


రామారెడ్డిలో...


దోమకొండలో...

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం


కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్ ఖాన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను అతి త్వరలోనే ప్రజలకు అందించేలా ప్రజా ప్రతినిధులు, నాయకులు సిద్ధమయ్యారని ఆయన స్పష్టం చేశారు. ప్రజా పాలనకు సంబంధించిన లబ్ధిదారులకు ఎలాంటి తప్పులు, కొట్టివేతలు లేకుండా కార్యకర్తలు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. అధికారులు సిబ్బంది సంయమనం పాటిస్తూ వారి దరఖాస్తు ఫారాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సాయిరెడ్డి, ధనుంజయ్, జావీద్ ఉద్దీన్, గంగాకృష్ణ, రవి, ఎమ్మెల్ రాజు, అంజయ్య, బీసీ సెల్ అధ్యక్షులు గంగాకిషన్, కురుమే శ్రీనివాస్, యువజన నాయకులు కార్తీక్ శంషుద్దీన్, సిద్ధసాయిలు, సయ్యద్ సల్మాన్, సంతోష్‌గౌడ్, గైని సాయిలు, అశోక్, గైని కిరణ్, ఎల్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో శ్రీరాములోరి అక్షింతల స్వాగత శోభయాత్ర


శ్రీరాములోరి అక్షింతల స్వాగత శోభయాత్రలో పాల్గొన్న చిన్నారులు

నవతెలంగాణ-మద్నూర్

శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం శ్రీరాముల వారి దీవెన అక్షింతల స్వాగత శోభాయాత్రకు భక్తులు వందలాదిగా తరలివచ్చారు. ఈ శోభాయాత్ర మండల కేంద్రంలోని బారడి పోచమ్మ ఆలయం వద్ద నుంచి ప్రారంభమై మండల కేంద్రంలోని రథంగల్లి, హరిజనవాడ, సంతోషిమాత గల్లీ, పోలీస్‌స్టేషన్ రహదారి గుండా పాత బస్టాండ్ మీదుగా గాంధీచౌక్ నుంచి ఎల్లమ్మగల్లి ప్రాంతంలో గల ఆర్య సమాజ్ భవనానికి చేరుకొని అక్కడ శ్రీరాముని వారి దీవెన అక్షింతలు సిద్ధంగా ఉంచారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 2024 జనవరి 22న రామ జన్మభూమి మందిర ప్రారంభోత్సవం రోజున ప్రతి గ్రామంలోని ప్రతి ఆలయంలో ఆయా గల్లీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీపీఎస్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-పిట్లం

తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ 2024 క్యాలెండర్‌ను స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సిపిఎస్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు రూప్‌సింగ్, ప్రధాన కార్యదర్శి రమేష్, సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని, విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని, క్రమశిక్షణలో విద్యనభ్యసించేలా కృషి చేయాలని సూచించారు. కాగా సిపిఎస్ ఉద్యోగులు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో తెలిపిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగులు రామకృష్ణ, ప్రదీప్‌రెడ్డి, నారాయణ, నాగభూషణం, మల్లయ్య, బలరాం, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్ కుట్టే దర్జీల నుంచి సీల్డ్ కొటేషన్‌ల ఆహ్వానం

- వచ్చే నెల 3 చివరి గడువు
- రీజినల్ కోఆర్డినేటర్ టి.సంపత్‌కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని గాంధారిలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కోఎడ్యుకేషన్ పాఠశాలలో బాలుర, బాలికల యూనిఫామ్ కుట్టేందుకు ఆసక్తిగల దర్జీల నుంచి సీల్డ్ కొటేషన్‌లు స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రాంతీయ సమన్వయకర్త టి.సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యక్తులు లేదా సంస్థలు వచ్చే నెల 3వ తేదీలోపు గాంధారి పాఠశాలలో సీల్డ్ కొటేషన్‌లు సమర్పించుకోవాలని ఆయన కోరారు. నియమ నిబంధనల అనుసారం యూనిఫామ్‌లు కుట్టివ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ద్వారా టెండర్ ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని వెల్లడించారు. టెండర్ ఫారంల కొరకు గాంధారి ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్ 9490957317ను సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పెద్దఎడ్గి సర్పంచ్ వినోద్, గుండూర్ సర్పంచ్ దేవిదాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ వర్గాలు నేటి నుంచి ప్రజా పాలనలో భాగంగా ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీ పథకాల దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచులు విఠల్, మారుతీ, అరుణ్, జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండలంలో 01.04.2022 నుంచి 31.03.2023 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన పనులపై ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. కాగా నేడు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో తెలిపారు. ప్రజా వేదికను ఎంపీపీ రాజుదాస్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- సైకిల్ యాత్రికుడు రాబిన్ సింగ్

నవతెలంగాణ-కామారెడ్డి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సైకిల్ యాత్ర చేపట్టిన రాబిన్ సింగ్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద గురువారం కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని తెలిపారు. రైతులు సేంద్రీయ ఎరువులు వాడే విధంగా చూడాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మినరల్ వాటర్ తాగవద్దని, బోరు నుంచి వచ్చే స్వచ్ఛమైన నీటిని తాగాలని సూచించారు. ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఈటర జిల్లా, చెక్కర్‌నగర్ తాలూకాకు చెందిన వాడినని తెలిపారు. గ్రీన్ ఇండియా మూవ్మెంట్‌లో భాగంగా ఉత్తరప్రదేశ్ నుంచి రామాయంపేట మీదుగా గురువారం కామారెడ్డి చేరుకున్నారు. రాత్రి వరకు నిజామాబాద్ చేరుకుంటానని తెలిపారు. ఇప్పటి వరకు 2,648 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేపట్టినట్టు వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తను ఈ సైకిల్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి ప్రాణవాయువును పెంచుకోవాలని సూచించారు. కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత ఏర్పడిందన్నారు. మొక్కలను సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు అందుతుందని పేర్కొన్నారు. పర్యావరణంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించేందుకు దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేపట్టినట్టు వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మరింత సమాచారం తెలుసుకోవాలంటే గ్రీన్ ఇండియా మూవ్మెంట్ ఫేస్‌బుక్‌లో చూడవచ్చునని తెలిపారు. తాను ఎమ్మే మాస్టర్ డిగ్రీ చదువుకున్నానని, ప్లాస్టిక్ వాడడం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు తెలియజేయడమే తన లక్ష్యమన్నారు. ఈ యాత్ర 2024 మార్చ్ 11 వరకు పూర్తి చేస్తానని తెలిపారు.


మాట్లాడుతున్న సైకిల్ యాత్రికుడు రాబిన్ సింగ్

పల్లెల్లో చెత్త చెదారం

- పట్టించుకోని గ్రామపంచాయతీ అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. అయినప్పటికీ గ్రామపంచాయతీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాల్లో పరిశుభ్రత ముఖ్యం. కానీ గ్రామపంచాయతీ అధికారులు, పాలకమండలి నిర్లక్ష్యంతో వీధులలో చెత్తచెదారం తలపిస్తుంది. మండల కేంద్రంలోని సహకార సంఘం మినీ వాటర్ ట్యాంక్ పాకురుబట్టింది. దాని పక్కనే చెత్తాచెదారం విచ్చలవిడిగా ఉండడంతో పందులు సంచరిస్తూ దుర్వాసన వ్యాపిస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్త చెదారం పట్ల ప్రజలు దుర్వాసన తట్టుకోలేకపోతున్నారు. స్థానిక గ్రామపంచాయతీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. మండలంలోని మంగళ్‌పహాడ్, కుర్నాపల్లి, తానాకాలన్, వడ్డేపల్లి, జానకంపేట్, పోచారం గ్రామాల మినహా మిగతా గ్రామాలలో మురికి కాలువలు శుభ్రంగా లేవు. అలాగే చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురికి కాలువల శుభ్రతతో పాటు వీధి రోడ్లలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.





లెన్స్ ప్రాబ్లం వల్ల బాధపడుతున్న అమ్మాయి

- ఆర్థికసాయం అందజేసి నిమ్స్ హాస్పిటల్‌కు తరలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/డిచ్‌పల్లి

లెన్స్ ప్రాబ్లం వల్ల బాధపడుతున్న అమ్మాయిని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్లతో మాట్లాడి హైదరాబాద్‌కు తరలించారని మండల యువజన విభాగం కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్ గురువారం తెలిపారు. డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన షేక్ రజియా అనే అమ్మాయి లెన్స్ ప్రాబ్లం వల్ల బాధపడుతుందని కుటుంబ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డికి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్‌తో మాట్లాడి వెంటనే హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స చేయించుకోవాలని కుటుంబీకులకు తెలిపారు. అమ్మాయి కుటుంబానికి నిజామాబాద్ రూరల్ యువజన విభాగం తరపున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రూరల్ యువజన విభాగం అధ్యక్షులు ఉమ్మజి నరేష్ జక్రాన్ పల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడు సొప్పారీ వినోద్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి అక్షరకు అభినందన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



జాతీయ స్థాయి తైక్వాండోకు వెళ్తున్న క్రీడాకారిణి అక్షరను తైక్వాండో జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య అభినందించారు. ఈ నెల 31న మధ్య ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ఛాంపియన్ షిప్‌కు వెళ్తున్న తైక్వాండో క్రీడాకారిణి అక్షర శ్రీనిధిని నగరంలోని బస్వా గార్డెన్‌లో గురువారం నిజామాబాద్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షర ఇటీవల వికారాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ తైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించిందని అన్నారు. జాతీయ స్థాయిలో కూడా తప్పకుండా గోల్డ్ మెడల్ సాధిస్తుందనే నమ్మకం ఉందని ఆయన ఆశభావం వ్యక్తం చేశారు. కోచ్ మనోజ్ కుమార్ శిక్షణలో ఈ క్రీడాకారిణి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుందన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

- విజేతగా వేల్పూర్ జట్టు



బహుమతి అందుకుంటున్న విన్నర్ జట్టు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి కొనసాగుతున్న జిల్లా స్థాయి సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. శివశక్తి యూత్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ క్రికెట్ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 25 జట్లు పాల్గొన్నాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.గంగాధర్ తెలిపారు. ఫైనల్ పోరులో వేల్పూర్, మోర్తాడ్ జట్లు తలపడగా వేల్పూర్ జట్టు విజేతగా నిలిచిందని అన్నారు. విజేతలకు నగదుతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేశారు. విజేత వేల్పూర్ జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టు మోర్తాడ్ కు రూ.5 వేల రూపాయలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్. కె.గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ-కిషన్, వీడీసీ అధ్యక్షులు ఎర్రోళ్ల విజయ్, విశ్రాంత ఉపాధ్యాయులు అంజయ్య, పల్లికొండ గోపీనాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు..

క్రీడలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ నర్సయ్య

నవతెలంగాణ-సిరికొండ

విద్యార్థిదశ నుండే క్రీడా ప్రావీణ్యం ఉంటే వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య తెలిపారు. సత్యశోధక్ స్పోర్ట్స్ మీట్ ను పాఠశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించి దేహధారుడ్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని వికసింపచేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో క్రీడలు ప్రధానమైన పాత్రను పోషిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, వివిధ పోటీలు నిర్వహించారు.కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రచారం హర్షణీయం

సైకిల్‌పై రాబిన్‌శర్మ దేశమంతా ప్రచారం

సర్పంచ్ మోహన్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అవగాహన కల్పిస్తున్న రాబిన్‌శర్మ

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాబిన్ శర్మ సైకిల్‌పై దేశమంతా ప్రచారం చేస్తూ ప్రజలను విద్యార్థులను అవగాహన కల్పించడం హర్షణీయమని సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం ఇందల్‌వాయి మండలంలోని గన్నారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం సందర్భంగా రాబిన్ శర్మ, సర్పంచ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. 448 రోజుల నుండి దేశమంతా తిరుగుతూ పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తుండడం విశేషమని, రాబిన్ శర్మ కల్పించడం ఎందరికో ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

అహ్వానించిన ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని దూస్గం గ్రామంలోని బిజెపి పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా వేసి సాధారంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని, దీంతో ఆయా పార్టీలో ఉన్న నాయకులు విసుగు చెంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. చేరిన వారందరికీ కొత్త పాత అనే తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గొల్ల జాయ దుర్గేష్ మాజీ సర్పంచ్, మంద లక్ష్మన్, ముల్క వేంకట్, సాకలి శ్రీనివాస్, మంద రెడ్డి, మంథ మోహన్, మంథ రాములు, మంథ శ్రీనివాస్, మంథ రాము, ముత్యం గంగాధర్, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు కంచెట్టి గంగాధర్, డాక్టర్ శాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ, త్యాగం, సేవకు పర్యాయపదం క్రైస్తవం

- ప్రొటోకాల్ పాటించకపోవడం సరికాదు
- గతంలో మంజూరైన అభివృద్ధి పనులను ఆపాలనుకోవడం మంచిదికాదు..
- కొనసాగించాలని సీఎంకు, మంత్రులకు సూచన
- క్రిస్మస్ సంబురాల్లో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించిన క్రిస్మస్ సంబురాల్లో అధికారులు పాల్గొనాలనే స్ఫూర్తిని పక్కకు పెట్టడం సరైంది కాదని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని మతాల పండుగలను అధికారికంగా నిర్వహించడాన్ని ప్రారంభించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. ఇలాంటి వేడుకల్లో ఆర్డీవో, సీఐ, ఎస్సైలు తదితర అధికారులు పాల్గొనే స్ఫూర్తి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొనసాగిందని గుర్తు చేశారు. వచ్చేసారి జరగబోయే ఈ వేడుకల్లో అధికారులందరూ పాల్గొనేలా చూస్తానన్నారు. ఫొటోలు పెట్టకుండా ప్రొటోకాల్ విస్మరించారని విమర్శించారు. ఫొటోలు పెట్టనంత మాత్రాన తనకు జరిగే ఇబ్బందేమీలేదన్నారు. ప్రజల మనస్సుల్లో తానున్నానన్నారు. కానీ, చట్టం, రాజ్యాంగ మార్గంలో నడవకపోవడం సరైంది కాదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ సహకారంతో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి మసీదులు, మందిరాలు, సంఘ భవనాలు తదితర అభివృద్ధి పనులకు చేయించిన మంజూరీలను ఆపాలని ప్రయత్నిస్తున్నట్టు వినిపిస్తోందన్నారు. అలాంటి ఆలోచన ఎంతమాత్రం సరికాదన్నారు. ఆ పనులు వ్యక్తులకు కాకుండా ప్రజలకు ఉపయోగపడే పనులని మరిచిపోకూడదన్నారు. పార్టీలు అధికారంలోకి రావడం మారినా.. ప్రభుత్వాలు కొనసాగుతాయని మరిచిపోకూడదన్నారు. ఒక ప్రభుత్వం ప్రజల కోసం మంజూరీ చేసిన పనులను ఆపేస్తే ఆ ప్రభుత్వం పార్టీ అనిపించుకుంటుందే తప్ప ప్రభుత్వం అనిపించకోదన్నారు. ఈ పనులకు యథావిధిగా ముందుకు తీసుకుపోవాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు సూచిస్తున్నా నన్నారు. మరోసారి తనను గెలిపించినందుకు మరింత బాధ్యతగా సేవ చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గంలోని ఎంపిపీలు, జెడ్పిటిసిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, బాల్కొండ నియోజకవర్గ క్రిస్టియన్ డెవలప్మెంట్ ఫోరమ్, అన్ని మండలాల క్రైస్తవ ఫాస్టర్ల అసోసియేషన్, అంతర్జాతీయ స్పీకర్ నిజామాబాద్ నుండి డాక్టర్ జాన్‌వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలి

మండల విద్యాధికారి ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మాట్లాడుతున్న ఎంఈవో ఆంధ్రయ్య

రాబోవు మార్చి 2024 లో జరగబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. గురువారం మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదులను సందర్శించి, పదవ తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో జిల్లా విద్యాశాఖ నిర్వహించే గ్రాండ్ టెస్ట్‌లు, ప్రీ ఫైనల్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి 70 శాతం మార్కులు సాధించాలన్నారు. ఉత్తమ గ్రేడ్ సాధించి ఐఐఐటి లో అధిక సంఖ్యలో ప్రవేశం పొందాలని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను ఇంటి వద్ద రివిజన్ చేయాలని, రాబోవు 100 రోజులు టీవీలు చూడ కుండా, పండుగలు, జాతరలకు వెళ్లకుండా ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ అయితే ప్రతి ఒక్క విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం కోనాపూర్ ప్రాథమిక పాఠశాల, కేసి తండా పాఠశాలలో యఫ్‌యల్‌యన్ పథకాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌదారపు రాంప్రసాద్, ఉపాధ్యాయులు నర్సింగ రావు, జ్ఞానేశ్వర్, రాజేందర్, కవిత, సీఆర్‌పీలు అంజయ్య, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మిమిక్రి కళాకారులకు సన్మానం

ఘనంగా ప్రపంచ మిమిక్రీ దినోత్సవం



ఆత్మీయ పురస్కారం అందుకున్న మిమిక్రి కళాకారులు

నవతెలంగాణ-మోపాల్

మంచిప్ప గ్రామంలోని జ్ఞానోదయ హైస్కూల్ ఆవరణలో శ్రీ లక్ష్మి శంకర్ నేతృత్వంలో నేరెళ్ళ వేణుమాదవ్ జయంతి సందర్భంగా ప్రపంచ మిమిక్రి దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ యార్లగడ్డ దక్షిణ మూర్తి వచ్చేసి సమాజంలో మిమిక్రి కళాకారుల అవశ్యకత, వారు చేస్తున్న సమాజ సేవ గురించి వివరించారు . మిమిక్రి పురాణ ఇతిహాస కాలం నాటి నుండే ఉందన్నారు. రామయణంలో మారీచుడు రాముడు గొంతుతో అరచి సీతకు భ్రమ కలిగించడం ధ్వనుకరణలో భాగం అని అన్నారు. నేటి సమాజంలో ధ్వనుకరణ ద్వారా సమాజంలోని అపోహలు దూరం చేస్తున్న వారిని అభినందించాల్సిన అవసరం ఎంతో వుంది అని కొనియాడారు. జిల్లాలో ప్రముఖమైన ధ్వనుకరణ కళాకారులు జాదు యుగంధర్ వేదాంతం రంగనాథ్‌కి, వాస రాబర్ట్, బొండ్ల ఆనంద్ కుమార్, శ్రీనివాస్‌తోపాటు సమాజసేవ చేస్తున్న ప్రముఖులకు ఆత్మీయ పురస్కారం అందజేశారు. కందాళి వినోద్ ఆచార్య, తిరునగరి శ్రీహరి, వాడేకర్ లక్ష్మణ్‌కు పురస్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో నరహరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన

అడిషనల్ కలెక్టర్ చిత్రా మిశ్రా

నవతెలంగాణ-ఆర్మూర్



దరఖాస్తులను పరిశలిస్తున్న అదనపు కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పాలనకు శ్రీకారం చుట్టిందని అడిషనల్ కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఖానాపూర్ గ్రామ సభను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే జనవరి ఆరో తేదీ వరకు గ్రామాలు, పట్టణాలలో గ్రామసభలు కొనసాగుతాయని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ ,విద్య, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో జరిగిన కార్యక్రమంలో చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, కౌన్సిలర్ ఆకుల రాము, మండలంలోని కోమన్ పల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీకాంత్, సర్పంచ్ రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాగపూర్‌లో ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రతినిధులకు సన్మానం



ఐసీఐసీఐ ప్రతినిధులలేనుసన్మానిస్తున్న పంచాయతీ కార్యవర్గం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


మండలంలోని నాగపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రతినిధులను గ్రామస్తులు సన్మానించారు. గ్రామంలో ఐసిఐసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగపూర్ చెరువు తూము, కాలువల మరమ్మతుకు రూ.31లక్షలు కేటాయించి, పనులు పూర్తి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఫౌండేషన్ ప్రతినిధులను సన్మానించారు. ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ పల్నాటి రజనీకాంత్, డివో అఖిల, టిఎఫ్ చింత శ్రీనివాస్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామస్తుల కోరిక మేరకు నాగపూర్ చెరువులో నుండి చేపలు బయటకు వెళ్లకుండా ఇనుప జాలి ఏర్పాటు చేసేందుకు రూ. పది లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ పల్నాటి రజనీకాంత్ తెలిపారు. అనంతరం కాలువలకు చెరువు తూము నుండి నీటిని విడుదల చేశారు. చెరువు తూము మరమ్మతు పనులు, చేపలు బయటకు వెళ్లకుండా ఇనుపజాలీల ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరు చేసినందుకు ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రతినిధులకు సర్పంచ్ పాలేపు సాయమ్మ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దుబ్బాక సుప్రియ, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బసకొండ మహేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బసకొండ శ్రీనివాస్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా అడ్మిషన్లు

బన్సల్ కాలేజీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఏఐపీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



అడ్మిషన్లకోసం ఏర్పాటుచేసిన బ్యానర్

నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్ ప్రాంతంలోని వేద్ కోచింగ్ సెంటర్లో బన్సల్ కళాశాల పేరుతో అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నారని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఏఐపీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐపిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ..బన్సల్ కళాశాలకు ఎటువంటి గుర్తింపు లేదని విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను మోసంచేస్తూ వారి వద్ద నుంచి అక్రమంగా అడ్మిషన్లకు పాల్పడుతున్నారని అన్నారు. ఆ కళాశాల యాజమాన్యం తక్షణమే విద్యాశాఖ అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా వేద్ ను స్థావరంగా చేసుకుని అడ్మిషన్లకు పాల్పడుతున్న వేద్ కోచింగ్ సెంటర్ ను కూడా సీజ్ చేయాలని విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. భవనాలు లేకుండా, బన్సల్ కళాశాల అంటూ చేస్తున్న ప్రచారాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి అడ్మిషన్ల తీసుకోవద్దని కోరారు. ఇప్పటికైనా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల, నవీన్ ,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రశాంత్ రెడ్డి పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఇనాయత్ నగర్, చౌట్ పల్లి గ్రామాల్లో గురువారం బాధిత కుటుంబాలను బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఇనాయత్ నగర్ లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు శంకర్ కుటుంబ సభ్యులను, చౌట్ పల్లిలో రైతు బంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ కొమ్ముల రాజేందర్ ను, కుటుంబ సభ్యులను ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. వారికి ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

నాగ్‌పూర్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/బాల్కొండ/ముప్కాల్



బాల్కొండ: నాగాపూర్ వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు తరలి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పలు వాహనాల్లో తరలివెళ్లారు. సభకు తరలి వెళ్లిన వారిలో నాయకులు పాలెపు నరసయ్య, గంగారెడ్డి, బుచ్చి మల్లయ్య, నాగపూర్ అశోక్, అబ్దుల్ రహీం, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బాల్కొండ:కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం నాగ్ పూర్‌లో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ భారీ సభకు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. 50 బస్సుల్లో దాదాపు 2000 మంది కార్యకర్తలు తరలివెళ్లారు.

ముప్కాల్:నాగ్‌పూర్‌లో నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ ప్రదర్శనకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, కిషన్ ఖేత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ కార్యదర్శి చంద రవి, డీసీసీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, మండల కార్యద్శి లక్ష్మణ్, రాజ్ వెంకట్ తదితరులు తరలివెళ్లారు.

యూనివర్సిటీలో కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో కాంగ్రెస్ పార్టీ 139 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటీ కమిటీ అధ్వర్యంలో యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు కొమిర శ్రీశైలం మాట్లాడుతూ.. భారతదేశానికి స్వతంత్రం తేవడంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఎనలేనిదని, అదేవిధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కూడా కాంగ్రెస్ పార్టీ పాత్ర గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరతి, ప్రొఫెసర్ కనకయ్య, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శి మహేష్,రాజేందర్, సాయి పవన్, విజయ, బాలాజీ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ కిట్లు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి



మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో గురువారం కెన్వ్యు కంపెనీ, లయన్స్ ఆఫ్ వివేకానంద వారి సమన్వయంతో విద్యార్థినీలకు శానిటరీ కిట్లను సర్పంచ్ దండ బోయిన సంజీవ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ రాజేందర్, ఉపాధ్యాయుల బృందం, కంపెనీ ప్రతినిధులు బి.రామానందం, కిషోర్, లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద వైద్యురాలు విజయలక్ష్మి, బంధం ప్రవీణ్, క్లబ్ అధ్యక్షులు చికోటి అశోక్, బి.సురేష్ తదితరులున్నారు.

ట్రాఫిక్ చలాన్ తగ్గింపునకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

- ఈనెల 27 నుంచి 30 వరకు
- జిల్లా కోర్టు సూపరింటెండెంట్ చంద్రసేనారెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా ట్రాఫిక్ చలాన్‌లో తగ్గింపునకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కోర్టు సూపరింటెండెంట్ చంద్రసేనారెడ్డి తెలిపారు. కామారెడ్డి జిల్లా కోర్టులో ఈనెల 27 నుంచి 30 వరకు ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు చలాన్ డబ్బులను చెల్లించవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సందర్భంగా జిల్లా ప్రజలను కోరుతున్నామన్నారు.

అభయహస్తానికి భారీ స్పందన

- ప్రజాపాలనను ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చిన ప్రజలు
- కొన్నిచోట్ల దరఖాస్తు ఫారాల కొరత
- ఫారాలు నింపే సమయంలో ఇబ్బందులు



పిట్లం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అభయ హస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం అట్టహాసంగా ప్రారంభించారు. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చారు. అయితే దరఖాస్తు ఫారాలను ప్రభుత్వమే పంపిణీ చేసినా.. కొన్నిచోట్ల వాటి కొరత ఏర్పడింది. అలాగే ఫారాలు నింపే సమయంలో ఎన్నో సందేహాలు వ్యక్తమయ్యాయి. దీంతో వారు ఇబ్బందులు పడ్డారు.

ప్రజా పాలనను సద్వినియోగం చేసుకోవాలి..

పిట్లం : ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో అభయహస్తం గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అభయ హస్తంలో పొందుపరిచిన సంక్షేమ పథకాలకు అవకాశమున్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయా పథకాలకు సంబంధించిన డాక్యుమెంట్స్ పత్రాలను, తదితర వివరాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని అధికారులకు ఆదేశించారు. దరఖాస్తు ఫారములు నింపడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన అంగన్వాడి, పంచాయతీ సెక్రెటరీ, ఇందిరక్రాంతి పథకం, ఆశావర్కర్లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జంబిగే హన్మాండ్లు, మాజీ అధ్యక్షులు రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, బొడ్ల రాజు, శపథంరెడ్డి, మాజీ సర్పంచ్ గంగారం, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రేణుక, సెక్రెటరీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని బంజపల్లి, మహ్మద్‌నగర్, అచ్చంపేట్ గ్రామాలలో అభయహస్తం దరఖాస్తు ప్రక్రియను ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయగౌడ్, ఎంపీడీవో నాగేశ్వర్, తహసీల్దార్ బిక్షపతి, మహమ్మద్‌నగర్, తహసీల్దార్ క్రాంతి కుమార్, మండల్ స్పెషల్ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, అలాగే వివిధ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అభయహస్తం దరఖాస్తుల పరిశీలన..

బిచ్కుంద : ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అభయ హస్తం గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని బిచ్కుంద మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారి డీఎల్‌పీవో శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మణ్, సీఐ కృష్ణ పరిశీలించారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రజలకు అర్థమయ్యేలా వివరించి పూర్తి చేసిన దరఖాస్తులను తీసుకొని లబ్ధిదారులకు రిసిప్ట్ అందచేయాలని అధికారులు సూచించారు. దరఖాస్తు ఫారాలు అయిపోవడంతో దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. దీంతో ఎస్సై మురళి తన సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా క్రమపద్ధతిలో అధికారుల చేత దరఖాస్తు ఫారాలు అందజేశారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ రేఖరాజు, ఎంపీడీవో ఆనంద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధర్పల్లి గంగాధర్, ఎంపిటిసి సురేష్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఆయా శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పర్ని : ఉమ్మడి మండలాలో పలు గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీడీఓ, సర్పంచ్‌ల సమక్షంలో నిర్వహించారు. ప్రజలు తమకు కావలసిన సంక్షేమ పథకాలను దరఖాస్తులో పూర్తి చేసి మండల ప్రజా పరిషత్ అధికారులకు అందించాలని ఎంపీడీఓ నీలావతి తెలిపారు.

ఇంటింటికీ దరఖాస్తు ఫారాలు అందజేత..

మద్నూర్ : తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీలు అమలు చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఈ నెల 28 నుంచి వచ్చే నెల జనవరి ఆరవ తేదీ వరకు గ్రామ సభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభించారు. మద్నూర్ ఉమ్మడి మండలంలోని మద్నూర్ డోంగ్లి మండలాల్లో గ్రామపంచాయతీల ద్వారా సిబ్బంది ఇంటింటికీ ప్రజాపాలన దరఖాస్తు ఫారాలను అందజేశారు.

రెండు గ్రామాల్లో ప్రజా పాలన సదస్సులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన సదస్సుల్లో భాగంగా మద్నూర్ మండలంలోని సుల్తాన్‌పేట్, గోజేగావ్ గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించిన ప్రతి కుటుంబం నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. సుల్తాన్‌పేట్ గ్రామంలో 255 దరఖాస్తులు వచ్చినట్లు, గోజేగావ్ గ్రామంలో 157 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఎండి ముజీబ్ తెలిపారు.

తప్పులేకుండా దరఖాస్తులు చేసుకోవాలి..

రెంజల్ : ప్రజా పాలనలో భాగంగా తప్పులు లేకుండా దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ రామచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్‌ఖాన్ సూచించారు. మండలంలోని కిసాన్ తాండ, దండిగుట్ట గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు మలావత్ జమున విజయ్, ముళ్ళపూడి శ్రీదేవి కృష్ణారావు అధ్యక్షత వహించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి కుటుంబానికి ప్రజా పాలన దరఖాస్తులు అందజేసినట్టు తెలిపారు. ఎలాంటి పొరపాట్లు రాకుండా కొట్టివేతలు లేకుండా దరఖాస్తులు క్షుణ్ణంగా నింపి అధికారులకు అందజేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో అధికారులు లక్ష్మీకాంతరెడ్డి, ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, హెచ్ఈఓ కరిపే రవీందర్, ఏఈఎస్ భాస్కర్, ఉపసర్పంచులు జగదీష్, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా కార్యదర్శి పీర్‌సింగ్, వ్యవసాయ విస్తీర్ణ అధికారిని భాగ్యశ్రీ, కాంగ్రెస్ నాయకులు మోబిన్ ఖాన్ ధనుంజయ్, సాయిరెడ్డి, రవి, సయ్యద్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి..

లింగంపేట్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని లింగంపేట్ జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రారంభోత్సవంలో భాగంగా మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి, పర్మల్ల, లింగంపేట్, మోతే, ఆయా గ్రామాలలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను వారు సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకే అర్హులైన లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గ్రామగ్రామాన లబ్ధిదారులు, నిరుపేదలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఆరుగ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో సుధాకర్, ఐకెపి ఏపిఎం శ్రీనివాస్, ఏపీవో అన్నపూర్ణ, ఎంపీఓ ప్రభాకర్‌చారి, సర్పంచులు అనిల్‌రెడ్డి, రామ్‌రెడ్డి, కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నారాగౌడ్, మోహిత్, సాయిరాం, పతియోద్దీన్, లింగంపేట్ సర్పంచ్ లావణ్య, ఉపసర్పంచ్ కౌడా రవి, ప్రసాద్‌గౌడ్, రాజు, నరేష్, ఎల్లమయ్య, అశోక్, రాముగౌడ్, దశరథ్, ప్రదీప్, కుద్దూస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



బిచ్కుంద : దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు



లింగంపేట్ : మాట్లాడుతున్న జెడ్పీటీసీ

ప్రజాపాలనకు 403 దరఖాస్తులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని ధర్మారెడ్డి, అచ్చాయిపల్లి, బొల్లారం గ్రామాలలో గురువారం నిర్వహించిన ప్రజాపాలనలో 403 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రఘు తెలిపారు.

సీఎం పిఆర్‌ఓను కలిసిన జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్

నవతెలంగాణ-రామారెడ్డి



పీఆర్‌ఓను సన్మానిస్తున్న మోహన్‌రెడ్డి

హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పిఆర్ఓ అయోధ్య రెడ్డిని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డిని గురువారం మర్యా దపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలి

- జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు



తనిఖీలు చేపడుతున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ సభ్యులు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండవ రోజు గురువారం జాతీయ నాణ్యత పరిణామాల కమిటీ సభ్యులు వైద్యులు పావెంత్, రోనాక్ శర్మ తనిఖీలు నిర్వహించారు. పలు రికార్డులను, వైద్య సిబ్బంది పనితీరు, ఆరోగ్య కేంద్ర పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతిల సంఖ్య పెంచాలని, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, డిపిఓ పద్మజ, పిహెచ్సి వైద్యులు సురేష్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి

- ఎంసిపిఐయు కేంద్ర కమిటీ సభ్యులు వల్లెపు ఉపేంధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని ఎంసిపిఐయు కేంద్ర కమిటీ సభ్యులు వల్లెపు ఉపేంధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎంసిపిఐయు పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఉపేంధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను ఎటువంటి షరతులు లేకుండా పేద ప్రజలకు వర్తింపచేయాలని అన్నారు. పలుచోట్ల కనీసం ఉండడానికి భూమి లేని పరిస్థితిలో ఉన్నవారికి ఇళ్లస్థలాల కోసం ప్రభుత్వ భూములను మంజూరు చేయాలన్నారు. కామారెడ్డి జిల్లాలో జనవరి 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయడానికి మేధావులు హాజరవుతున్న సందర్భంగా వ్యాపారవేత్తలు, వాణిజ్య వర్తక వివిధ సంస్థల ఈ సమావేశాలకు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మలవత్ జబ్బర్ నాయక్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, నర్సింలు, సుజాత, సదానందం, అంతంపల్లి రమేష్, బట్టు లక్ష్మి, సత్యవా, లక్ష్మీనారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఉత్సవాలకు తరలివెళ్తున్న నాయకులు

నవతెలంగాణ-గాంధారి

గాంధీభవన్‌లో జరుగుతున్న సేవాదళ్ 100 సంవత్సరాల ఉత్సవాల్లో పాల్గొనడానికి కామారెడ్డి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు లింగగౌడ్ అధ్యక్షతన బయలుదేరిన సేవాదళ్ నాయకులు తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ ఏర్పడి నేటికీ 100 సంవత్సరాలకు చేరుకున్న సందర్భంగా గాంధీభవన్‌లో జరుగుతున్న సేవాదళ్ ఉత్సవాల్లో పాల్గొనడానికి సేవాదళ్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు లింగగౌడ్, ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, సేవాదల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంగ్యానాయక్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నాలుగు నియోజకవర్గాల నుంచి అన్ని మండలాల అధ్యక్షులు సదాశినగర్ సేవాదళ్ మండల అధ్యక్షులు నౌసి నాయక్, రామారెడ్డి మండలాధ్యక్షులు బట్టు సత్యనారాయణ, గాంధారి సేవాదళ్ మండల అధ్యక్షులు సంగని బాబా, తాడ్వాయి మండల అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, లింగంపేట్ మండలాధ్యక్షులు పీర్‌సింగ్, ఎల్లారెడ్డి మండలాధ్యక్షులు కమ్మరి భాస్కర్, వివిధ మండలాల అధ్యక్షులు, సేవాదళ్ కుటుంబ సభ్యులు గాంధీ భవన్‌కు తరలివెళ్లారు.

దేశాభివృద్ధిలో కాంగ్రెస్‌ది కీలకపాత్ర

- కాంగ్రెస్ నాయకులు
- ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ

నవతెలంగాణ-విలేకరుల బృందం

దేశాభివృద్ధిలో కాంగ్రెస్‌ది కీలకపాత్ర అని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు ఆ కార్యాలయాల వద్ద జెండావిష్కరణ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు.



రామారెడ్డి : జెండావిష్కరణ చేస్తున్న దృశ్యం

రామారెడ్డి : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ దేశానికి ఎనలేని సేవ చేసిందని, దేశానికి స్వతంత్రం తెచ్చిన నుంచి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

100 సంవత్సరాలు దాటినా ఆదరణ తగ్గనిది కాంగ్రెస్ పార్టీ..

నాగిరెడ్డిపేట్ : 100 సంవత్సరాలు దాటినా ప్రజల్లో ఆదరణ తగ్గని పార్టీ కాంగ్రెస్ పార్టీ అని.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 100 సంవత్సరాలు దాటినా కూడా ప్రజల్లో ఆదరణ తగ్గకుండా ప్రజాపాలన కొనసాగుతున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలకు అనుగుణంగా గురువారం నుంచి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభించి 6 గ్యారంటీలపై దరఖాస్తులను స్వీకరిస్తుందని తెలిపారు. జనవరి 6 నాటికి దరఖాస్తు స్వీకరణ పూర్తి అయినా.. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాల్‌తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ బోయిన విట్టల్, నాయకులు లక్ష్మణ్, ఇమామ్, సాయికుమార్, డివిటి కిష్టయ్య, బషుమియ, ఆంజనేయులు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట్ : మాట్లాడుతున్న నాయకులు

దరఖాస్తులు నిరంతరం స్వీకరిస్తాం

- తహశీల్దార్ మల్లయ్య

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన గ్రామసభలలో ప్రజల దరఖాస్తులను నిరంతరం స్వీకరిస్తామని ఎలాంటి ఇబ్బందులు పడవద్దని సాలూర మండల తహసీల్దార్ మల్లయ్య అన్నారు. గురువారం ఆయన సాలురా మండలంలోని ఫతేపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు వారికి అవసరమైన పథకాలను దరఖాస్తు ఫారంలో పూర్తిచేసి ఇవ్వాలని సూచించారు. గ్రామసభలు వారం రోజులు కాకుండా ప్రజలు ఎప్పుడు దరఖాస్తు పత్రాలు తీసుకువచ్చినా వాటిని స్వీకరించి ప్రభుత్వానికి పంపుతామని అన్నారు. మండలంలోని కొప్పర్తి క్యాంపులో సర్పంచ్ బొల్లెపల్లి సుశీల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. బోధన్ మండలంలోని మావందికలాన్, మావంది ఖుర్దు, బోధన్ మండలంలోని సంగెం, భవానిపేట్ గ్రామాలలో గురువారం గ్రామసభలు నిర్వహించి ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ అమీర్, కృష్ణప్రసాద్, అంజమ్మ, ఉప సర్పంచ్ సావిత్రి, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లయ్య

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి/లింగంపేట్/గాంధారి/సదాశివనగర్

ప్రజలకు చేరువగా పాలనను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం అభయ హస్తం కింద అర్హులైన నిజమైన లబ్ధిదారుల నుండి మహాలక్ష్మి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నదని అన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపాలిటీ దేవునిపల్లిలోని 12వ వార్డు, సదాశివనగర్ మండలంలోని వడ్లూర్ ఎల్లారెడ్డి, సదాశివనగర్, గాంధారి, లింగంపేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమ తీరుతెన్నులను రాష్ట్ర పరిశీలకులు విద్యా శాఖ సంయుక్త కార్యదర్శి హరిత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరిలతో కలిసి పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. ఆయా గ్రామ సభలలో అవసరమైన దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచడం, షామియానా, మంచినీటి సౌకర్యం కల్పించడం, దరఖాస్తులు నింపడానికి ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లు, దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను పరిశీలించి వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఉత్సాహభరితంగా దరఖాస్తులు అందజేయుటకు గ్రామ సభలకు వస్తున్నారని, వారికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక హెల్ప్ డెస్క్ కౌంటర్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తు ఫారాలు నింపడంలో గ్రామ కార్యదర్శులు, వార్డు సిబ్బంది సహాయపడుతు న్నారని అన్నారు. నేటి నుండి జనవరి, 6, 2024 వరకు (8) పనిదినాలలో రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీ, మునిసిపల్ వార్డుల్లో ఒకేసారి ఈ ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించడాం ద్వారా ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చి నిర్ణీత కాలవ్యవధిలోగా సామాజిక భద్రతా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు పరచనుందని అన్నారు. జిల్లాలోని 526 గ్రామా పంచాయతీలు, మూడు మునిసిపాలిటీలలోని 80 వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో 2,93,635 కుటుంబాలున్నాయని, అన్ని పథకాలకు కుటుంభం నుండి ఒకే దరఖాస్తు ఇస్తే సరిపోతుందని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తు ఫారాలు ఉచితంగా అందజేస్తున్నామని, దరఖాస్తులో లబ్ది దారుడు పొందాల్సిన పథకాలకు టిక్ మార్కు చేస్తూ రేషన్ కార్డు, ఆధార్ కార్డు జతపరచాలని సూచించారు. రేషన్‌కార్డు లేని, కొత్తగా రేషన్ కార్డు కావలసిన వారు దరఖాస్తు ఫారం మొదటి పేజీలోని రేషన్ కార్డు నెంబరు దగ్గర లేదు, కొత్త రేషన్ కార్డు అవసరం అని పొందుపర్చాలని ప్రత్యేక దరఖాస్తూ అవసరం లేదని అన్నారు. దరఖాస్తు ఇవ్వడానికి అభ్యర్థే రానవసరం లేదని, ఎవరైనా ఇవ్వవచ్చుని స్పష్టం చేశారు. టీమ్ లీడర్ సూచనల మేరకు గ్రామ సభల వద్ద హెల్ప్ డెస్క్‌లు అవసరం మేర పెంచాలని, ఒకవేళ ఏదేని కారణాల వల్ల గ్రామ సభ రోజు దరఖాస్తు చేయని వారు జనవరి 6 లోగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు అందజేయవచ్చని, వారికి తప్పక రసీదు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్పర్సన్ ఇందు ప్రియ, మునిసిపల్ కమీషనర్ దేవేందర్, ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఓ లక్ష్మి, తహశీల్దార్ హిమబిందు, వార్డు సభ్యురాలు కాసర్ల గోదావరి తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్ : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్